

ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని, సేవలను పారదర్శకంగా అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో అవినీతి నిరోధక శాఖ రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ మధు, ఇన్‌స్పెక్టర్‌లు స్వామి, కిరణ్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

హాజీపూర్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని గుడిపేట్‌లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో శని వారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి ఎంజేపీటీబీ ఆర్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగజ్యోతి అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు, చిన్న బహుమతులను పెద్దలకు అందించి పాదాభి వందనం చేశారు. ప్రిన్సిపల్ దిలీప్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పంచాయతీ ప్రచారం

- జోరు పెంచిన సర్పంచ్ అభ్యర్థులు
- మందీ మార్బలంతో పర్యటన
- ఇంటింటికీ వెళుతూ..ఓట్లు అడుగుతూ
- బిజీబిజీగా గడుపుతున్న కుటుంబ సభ్యులు



మంచిర్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ సర్పంచ్ అభ్యర్థులు పూర్తిగా ప్రజా క్షేత్రంలోనే గడుపుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ మద్దతుదారుల తరుపున ప్రచారాలను ముమ్మరం చేశాయి.జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులు నిత్యం ప్రజల మధ్యనే గడుపుతూ వారి మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఇంటింటా ప్రచారం నిర్వహిస్తూ తమను గెలిపిస్తే ఎలాంటి అభివృద్ధి కార్యక్ర మాలు చేపడతారో ఓటర్లకు వివరిస్తున్నారు. మైకుల తో ప్రచారం నిర్వహించేందుకు అభ్యర్థులు ప్రత్యేక ఏర్పాట్లను చేసుకుంటున్నారు. గ్రామాల్లో జట్ల వారీగా నాయకులు, కార్యకర్తలు ఒక్కో ప్రాంతాన్ని ఎంచుకుంటూ ఓటర్ల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పోటా పోటీగా...

ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీల మద్దతున్న అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఒకరికి మించి మరొకరు వినూత్న రీతిలో ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలతో 16 గంటల పాటు ప్రజల మధ్య గడుపుతున్నారు. ఉదయం 6 గంటలకే ప్రజల్లోకి వెళుతున్న నాయకులు రాత్రి పదింటికి గాని ఇళ్లు చేరడం లేదు. పంచాయతీ ఎన్నికలు ఈ నెల 11,14,17 తేదీల్లో మూడు విడతలుగా ఉన్నాయి. మొదటి విడత ప్రచారానికి మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థులు ప్రచార హోరు పెంచారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ కష్టపడుతూనే ఉన్నారు. అల్పాహారం మొదలుకొని రాత్రి భోజనం వరకు ప్రజల తోనే కానిస్తున్నారు. ప్రధాన పార్టీల మద్దతు న్న అభ్యర్థుల నడుమ విపరీతమైన పోటీ ఉన్న కారణంగా గెలుపే లక్ష్యంగా ఎవరికి వారే ముమ్మర పోరాటం చేస్తున్నారు.

కుటుంబ సమేతంగా...

పంచాయతీ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు వారి కుటుంబాల సమేతంగా పాల్గొంటూ బిజీబిజీగా గడుపుతున్నారు. ఇంటిల్లిపాది తలో దారిలో ఇంటింటికీ వెళుతూ ఓటర్లతో మిలాఖత్ అవుతున్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల పరిధిలో ప్రధాన పార్టీల నేతల కుటుంబ సభ్యులను ఇతర ప్రాంతాల్లో ఉన్నవారిని ప్రత్యేకంగా రప్పించుకొని మరీ ప్రచారంలో పాల్గొంటున్నారు.

మంచిర్యాలలో నియోజక వర్గంలోని మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లిలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు సతీమణి కొక్కిరాల సురేఖ గ్రామాల్లో పర్యటిస్తూ కాంగ్రెస్ మద్దతిస్తున్న అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా శ్రమి స్తున్నారు.

అలాగే బీజేపీ బలపరిచిన అభ్యరులకు మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సతీమని స్రవంతి గ్రామాల్లో పర్యటిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ బలపరిచిన అభ్య ర్థులకు మద్దతుగా లక్సెట్టిపేట మండలంలో ఇంటింటికీ తిరుగుతూ మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు తనయుడు నడిపెల్లి విజిత్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. అలాగే చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోనూ అక్కడి ఎమ్మెల్యేలు గడ్డం వివేకానంద (మంత్రి),

మిగతా 7వ పేజీలో..



ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

మంచిర్యాల ఏసీపీ ప్రకాష్



వెల్గనూర్‌లో పోలీసు కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ. సీఐ, ఎస్సైలు. పోలీసులు

దండేపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పంచాయతీ ఎన్నికలు జరుపుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ అన్నారు. శనివారం దండేపల్లి మండలం వెల్గనూర్‌లో పోలీసు కవాతు నిర్వహించారు. ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు స్వేచ్ఛయుత వాతావరణంలో ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, మంచిర్యాల మహిళ పోలీసుస్టేషన్ సీఐ నరేష్, దండేపల్లి, లక్సెటిపేట, జన్నారం ఎస్సైలు తహసీ నోద్దీన్, గోపతి సురేష్, గొల్లపెల్లి అనూష పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఏసీపీ సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అల్లర్లు సృష్టించేందుకు ఎవరన్నా ప్రయత్నిస్తే వారిని అదుపులోకి తీసుకోవాలని అన్నారు. అనవసరంగా యువత గొడవల్లో ఇరుక్కుని కేసుల పాలు కావద్దని ఆయన సూచించారు.

టీషర్ట్ కిట్ల పంపిణీ

మంచిర్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాసా ప్రాజెక్టు సిద్ధం చేసిందుకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను డీసీపీ భాస్కర్ అభినందించారు. శనివారం తన కార్యాలయంలో ప్రాజెక్టు సిద్ధం చేయడానికి ఉపయోగపడే నాసా కిట్లను పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం శ్రీ చైతన్య నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తమ పేర్లను నమోదు చేసుకుంటారని ప్రిన్సిపాల్ ఆయూబ్ ఈ సందర్భంగా తెలిపారు. ఏజీఎం అరవిందరెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజు విద్యార్థులను అభినందించారు. డీన్ శ్యాం, నాసా ఇన్‌చార్జి స్వాతి, ప్రియాంక, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్: కలెక్టర్ కుమార్‌దీపక్



అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారతదేశానికి మహోన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ఎస్ అంబేద్కర్ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డీడీ చాతరాజుల దుర్గా ప్రసాద్, డీఆర్‌డీవో కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా సహకార అధికారి హనుమంతరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

లక్సెట్టిపేట, డిసెంబరు, 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో 2వ సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల్లో విధులు చేపడు తున్న ప్రొసిడింగ్ అధికారులతో పాటు రిటర్నింగ్ అధికారులకు పలు అంశాలపై శనివారం ఎంపీడీవో సమక్షంలో శిక్షణ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 7,8వ తేదీల్లో సంబంధిత మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం నంబర్14 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల విధులకు ఈనెల 10న ఉదయం పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. 11వ పోలింగ్ ముగిసిన తర్వాత అదే రోజు ఓట్ల లెక్కింపు ఉంటుంద న్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, ఎమ్మార్వో దిలీప్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

హాజీపూర్ : మండలంలోని ఎన్నికల సిబ్బందికి గుడిపేట్‌లోని రైతు వేదికలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల ఎన్నికల అధికారి, మండల ఎంపీడీవో వెంకటరెడ్డి, టీటీటీ వామ నమూర్తిలు పలు అంశాలపై శిక్షణ అందించారు.

బ్యాలెట్ బాక్స్‌లను ఎలా తెరవాలి, ఎలా సీల్ చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మండల నోడల్ అధికారి శంకర్, తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారం: స్థానిక సంస్థల నిర్వహణపై ఎంపీడీవో ఉమర్ షరీఫ్ శనివారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెర్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రొసిడింగ్ అధికారులు, ఎంఈవో విజయ్ కుమార్, ఏపీవోలు పాల్గొన్నారు.

మంత్రి సతీమణికి జాతీయ అవార్డు



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న మంత్రి సతీమణి సరోజ వివేకానంద

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి సతీమణి సరోజవివేక్‌కు కాల్‌గ్లోబల్ సమ్మిట్ 2025 అవార్డు అందుకున్నారు. ఇటీవల న్యూ ఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కాల్ గ్లోబల్ సమ్మిట్ 2025 అవార్డును ఆమె అందుకున్నారు. ఈ అవార్డు ప్రధానంగా విద్యా వ్యాప్తితో పాటు నాణ్యమైన విద్యా, ప్రమాణాల అభివృద్ధికి చేసినందుకు గుర్తింపుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ కార్య క్రమంలో సరోజ భర్త మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అభివృద్ధి

డీసీసీ మాజీ అధ్యక్షురాలు సురేఖ



ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులతో ర్యాలీగా వస్తున్న సురేఖ

దండేపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని డీసీసీ మాజీ అధ్యక్షురాలు, ఎమ్మెల్యే సతీమణి కొక్కిరాల సురేఖ అన్నారు. శనివారం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని చిల్కగూడ, తానిమడుగు దండేపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా కరపత్రాలతో ప్రచారం చేశారు. గ్రామాల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచు, వార్డు సభ్యులను గెలిపిస్తే గ్రామాలు మరింత అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీలు గడ్డం శ్రీనివాస్, అక్కల శకుంతల, సర్పంచ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

‘బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్’



నస్పూర్‌లో నివాళులు అర్పిస్తున్న విశ్వ బ్రహ్మణ సంఘం నాయకులు

నస్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టకుండా నిర్లక్ష్యం చేస్తుందని అఖిల భారత విశ్వ బ్రహ్మణ మహాసభ రాష్ట్ర కార్యదర్శి కర్ణకంటి నరసింహచారి విమర్శించారు. షిర్కే చౌరస్తాలో ఈశ్వరాచారి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలో భాగంగా 42 శాతం బీసీలకు రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిడ్డలు ఎవరూ కూడా ఆత్మహత్యలకు పాల్పడవద్దన్నారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేధిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగన్న పేట విజయ్‌కుమార్, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు తెలుకుంట్ల రాజాచారి, మనోహర్, వీరాచారి, రాజయ్య పాల్గొన్నారు.

కక్షిదారులు న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించుకోవాలి..

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ. వీరయ్య



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి వీరయ్య

మంచిర్యాల క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లోక్ అధాలత్‌లో కేసులు పరిష్కరించేందుకు కక్షిదారులు ఇరు పక్షాల వారు న్యాయ సేవా సంస్థ సేవలను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య అన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో జాతీయ లోక్ అదాలత్ గురించి జిల్లా న్యాయస్థాన సమన్వయ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉన్నత న్యాయస్థాన ఆదేశాల ప్రకారం ఈ నెల 21 ఆదివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, లక్సెట్టిపేట న్యాయస్థానాలలో లోక్ అదాలత్ నిర్వహిస్తామని తెలిపారు. మోటర్‌వాహన నష్ట పరిహారం, ఎన్ఐ యాక్టు, క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు పరి ష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయ మూర్తి లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఎ నిర్మల, డీసీపీ భాస్కర్, అడిషనల్ సీని యర్ సివిల్ జడ్జి రాంమోహన్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కవిత, నిరోశ, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కృష్ణ తేజ, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, ఉన్నతాధికారులు, సిబ్బంది, ఏసీపీలు, తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి
మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్
7
‘లెదర్ పార్కు స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే..చర్యలు తప్పవు’

సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాలి

- ఎమ్మెల్సీ దండె విఠల్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క హిందూ సంస్కృతి సంప్రదాయాలను సంఘటితంగా కాపాడుకోవాలని ఎమ్మెల్సీ దండె విఠల్ సూచించారు. సిర్పూర్(టి) మండలం నవేగాం గ్రామంలో శివసాయి జాతర సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి ఏర్పాటు చేసిన నాటక ప్రదర్శన కార్యక్రమానికి ఎమ్మెల్సీ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించిపోతున్న నాటక కళా ప్రదర్శనను నవతరానికి నవేగాం గ్రామస్థులు అందించడం గొప్ప విషయమన్నారు. పల్లెలకు దూరం అవుతున్న నాటక రంగంను ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం బోరు ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్థులు ఎమ్మెల్సీకి ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పంగిడి సోమారం అడవుల్లో పులి కదలికలు

అడవిలోకి వెళ్లవద్దని అధికారుల చాటింపు

కోటపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంగిడి సోమారం అడవుల్లో పులి కదలికలు ఉన్నాయని ఎవరు కూడా అటవీ ప్రాంతం వైపు వెళ్లవద్దని శనివారం సాయంత్రం అటవీ అధికారులు గ్రామంలో చాటింపు చేయించారు. నెన్నెల మండలం నుంచి పులి ఇటు వైపు వచ్చిందని, ఉదయం తొమ్మిది గంటలలోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత పత్తి చేన్లకు గాను సమీప అటవీ ప్రాంతాలకు ఎవరు వెళ్లవద్దని సూచించారు. మధ్యాహ్నం వేళ చేన్లలోకి ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని, అటవీ అధికారులకు సహకరించాలని సూచించారు.

విత్తన డీలర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకట్

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ రైతు వేదికలో జిల్లా వ్యవసాయాధికారి వెంకట్ ఆధ్వర్యంలో విత్తన డీలర్లకు నూతన విత్తన చట్టం-2025పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ భారత ప్రభుత్వం తీసుకు వచ్చిన విత్తన చట్టం -2025 గురించి డీలర్లకు వివరించారు. విత్తన చట్టం 1966కు, కొత్త విత్తన చట్టం వల్ల కొత్తగా రాబోయే మార్పులను వివరించారు. డీలర్లందరు కొత్త విత్తన చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తమకు ఏమైనా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు ఉన్నట్లయితే భారత రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఈ-మెయిల్ అడ్రస్‌కు గానీ, జిల్లా వ్యవసాయాధికారికి రాతపూర్వకంగా డిసెంబరు 11 లోగా సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాల కులు మనోహర్, మిలన్‌కుమార్, ఏఓలు, ఏఈఓలు, జిల్లాలోని డీలర్లు పాల్గొన్నారు.



పులులతో తస్మాత్ జాగ్రత్త

- పత్తి ఏరివేత పనులు వేగవంతం
- పులుల కారిడార్ గ్రామాలపై అటవీ శాఖ అధికారుల దృష్టి
- ప్రజలకు అవగాహన సమావేశాలు



కాగజ్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సిర్పూరు నియోజకవర్గంలో పత్తి ఏరివేత పనులు వేగవంతం చేశారు. సిర్పూరు నియోజకవర్గంలోని కౌటాల, బెజ్జూరు, పెంచికల్‌పేట, దహెగాం, కాగజ్‌నగర్ మండలాల్లో పులుల కారిడార్ ప్రాంతం ఉన్న నేపథ్యంలో అంతా అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ మేరకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతులకు, గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఏడాది క్రితం నవంబరు నెలలో ఈసుగాం మండలంలో పత్తి ఏరుతున్న మహిళ మోహర్లే లక్ష్మి(26) పై దాడి చేసి అక్కడికక్కడే చంపేసింది. ఈ సంఘటన అనంతరం ఈసుగాం క్యాంపుల్లో కూడా పులి సంచరించినట్టు అప్పట్లో అధికారులు తేల్చారు. పులి దాడి సంఘటనలు ఏటా నవంబరు-డిసెంబరు నెలలో పత్తి ఏరివేత సమయంలో జరుగుతుండటంతో ఈసారి ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా అటవీ శాఖ అధికారులు ముందస్తుగానే చర్యలు తీసుకుంటున్నారు. ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్, ఎఫ్ఆర్‌వో అనిల్ ప్రత్యేక ప్రణాళికల ఆధారంగా పులి కారిడార్ ఉన్న 30 గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాత్రి వేళల్లో నేరుగా గ్రామాల్లోకి వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పులి పట్ల తీసుకోవాల్సిన చర్యలపై కూడా వివరిస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకూడదన్న లక్ష్యంతో ముందడుగు వేస్తున్నారు.

పులులను కాపాడుకోవటం అందరి బాధ్యత

సుశాంత్ సుఖ్‌దేవ్, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

పులులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పులులతోనే అడవులకు పూర్తి రక్షణ ఉంటుంది. ప్రస్తుతం పులి కారిడార్ ఉన్న గ్రామాలపై దృష్టి సారిస్తున్నాము. ఏటా నవంబరు నెలలోనే పత్తి ఏరివేత పనులు జరుగుతుంటాయి. గతంలో జరిగిన దాడులు కూడా పూర్తిగా నవంబరు నెలలో ఉన్నాయి. తాము పులి దాడి సంఘటనలు జరగకుండా పక్కా ప్రణాళికతో అన్నిచర్యలు తీసుకుంటున్నాం. బీట్ల వారీగా రాత్రి వేళల్లో సిబ్బంది గస్తీ కాస్తున్నారు. కారిడార్ గ్రామాలపై పక్కాగా దృష్టి సారించాము. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాము.

పక్కా ప్రణాళికతో..



అనీల్, ఎఫ్ఆర్‌వో, కాగజ్‌నగర్

పులుల సంరక్షణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పత్తి ఏరివేత జరుగుతున్న సమయం కాబట్టి రాత్రి వేళల్లో పులి కారిడార్ ఉన్న సమీప గ్రామాలకు సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాము. కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలి. సాయంత్రం నాలుగు గంటలు కాగానే ఇంటి ముఖం పట్టాలి. పులిపై రాళ్లు విసరటం, కర్రలతో కొట్టడం లాంటి చర్యలు చేయవద్దు.

అధికారుల సూచనలివే...

- పులి కారిడార్ గ్రామాల్లో ప్రధాన పత్తి వేరి పనుల్లో పాల్గొనే కూలీలు గుంపులు గుంపులుగా పోవాలి.
- ఉదయం పది గంటల తర్వాతనే వెళ్లాలి.
- సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇంటి ముఖం పట్టాలి.
- పులి ఉన్న ప్రాంతంలో ఎవరు కూడా సంచరించకుండా అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఫొటోలు తీయటం, రాళ్ల, కర్రలతో కొడితే మనుషులపై పులి దాడి చేసే అవకాశాలు ఎక్కువ.

గతంలో జరిగిన సంఘటనలు..

- 2020లో దహెగాం దిగిడ గ్రామంలో సిడాం విఘ్నేష్‌పై దాడి చేసి చంపేసింది.
- 2024 నవంబరు నెలలో ఈసుగాం మండలంలో పత్తి ఏరుతున్న మోహర్లే లక్ష్మి దాడి చేసి చంపేసింది.
- 2024 నవంబరు చివరి వారంలో సిర్పూరు(టి) దుబ్బగూడకు చెందిన రైతు సురేష్‌పై దాడి చేసింది.
- 2024లో హడ్కిలి అడవిగడ్డ వద్ద పశువు, మేకను చంపేసింది.



రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలో తిరుగుతున్న సిబ్బంది (ఫైల్)

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



గుడుంబాను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కాసిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడితండా(డీ) అటవీ శివారు ప్రాంతంలో గుడుంబా తయారు చేస్తున్న స్థావరాలపై శనివారం దేవాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1,500 లీటర్ల బెల్లం పానకం, 200 లీటర్ల గుడుంబాను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శాంతియుతంగా ఎన్నికలు జరిగేందుకు గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలాటిగూడ గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పాఠశాల ప్రహరీకి ఢీకొట్టడంతో గుండ మారయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మారయ్య మద్యం మత్తులో బైక్‌పై ఆసిఫాబాద్ నుంచి చిలాటిగూడ వైపు వస్తున్నాడు. ఈక్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పాఠశాల గోడను ఢీకొట్టాడు. దీంతో మారయ్య ఎడమ చేయి విరగగా తలకు తీవ్ర గాయమైంది. 108 సిబ్బంది ప్రవీణ్‌యాదవ్, సంతోష్ అక్కడికి చేరుకొని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పగుళ్లు బారుతున్న రోడ్లు



చింతగూడ(కె) గ్రామంలో పగుళ్లుబారిన సీసీ రోడ్డు

కాగజ్‌నగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటు రోడ్లు కేవలం ఏడాది లోగానే పగుళ్లు బారుతున్నాయి. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు అనతి కాలంలోనే పాడవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో గత సంవత్సరం ఈజీఎస్, ఇతర నిధులతో సిమెంటు రోడ్లు నిర్మాణం చేశారు. అయితే ఏడాది తిరగక ముందే సిమెంటు రోడ్లు శిథిలం అవుతున్నా యి. కొన్ని చోట్ల పగుళ్లు బారుతున్నాయి. మరికొన్ని చోట్ల సిమెంటు లేచిపోయి కంకర తేలుతోంది.

గత సంవత్సరం కేంద్రం నుంచి వచ్చిన కోట్లాది రూపాయల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు నిర్మించారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేశారని అప్పట్లోనే పలు చోట్ల ఆరోపణలు వచ్చాయి. కానీ ఎవ్వరూ పట్టించకు లేదు. కొన్ని నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగించడంతో ఆ పనులు ఇతరులకు పర్సంటేజీలకు ఇవ్వడంతో ఒకరినుంచి మరొకరికి చేతులు మారాయి. దీంతో నాణ్యత లేకుండానే ఇష్టారాజ్యంగా నిర్మించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

ఈజీఎస్ నిధులు ఇష్టారాజ్యం

కేంద్రం నుంచి వచ్చే ఎన్ఆర్ఈజీఎస్ నిధుల సిమెంట్ రోడ్ల పనులు ఇష్టారాజ్యంగా చేపట్టిన కూడా వాటిని పట్టించునే నాధుడే లేకపోవడంతో పనుల్లో నాణ్యత లోపించింది. నాణ్యత లేకున్నా సంబంధిత అధికారులు బిల్లులు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరో పణలున్నాయి. కోట్లాది రూపాయల పనులు దుర్వినియోగం అవుతున్నప్పటికీ నాయకులు కూడా పట్టించుకో లేదు. అధికారులు చూసీ చూడనట్లు, నాయకులు తెలిసీ తెలియనట్లు వదిలేశారు. దీంతో కేవలం ఏడాదిలోగానే చేసి న పనులు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. మండలంలోని బోరిగాం, చారిగాం, చింతగూడ, ఈస్‌గాం తదితర గ్రామపంచాయతీల్లో వేసిన రోడ్లు కాంట్రాక్టర్ల, అధికారుల ధనదాహానికి నిదర్శనంగా మారాయిని విమర్శలున్నాయి. ఇప్పటికైనా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- అడిషనల్ ఎస్పీ చిత్తరంజన్

తిర్యాణి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చూడాలని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. శనివారం తిర్యాణి మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన మారుమూలన ఉన్న మంగి ప్రాంతంలో ఏఎస్పీ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన మాట్లాడారు. విధుల్లో ఉన్న అధికారులకు సహకరించాలన్నారు. అనంతరం అర్జున్‌లొద్దిలోని భీమన్న ఆలయం వద్ద జరుగుతున్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలు భిన్నంగా ఉటాయని, వారి సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమకు అపారమైన గౌరవం ఉందన్నారు. గిరిజనులు ప్రకృతితో మమేకమై జీవిస్తారని పేర్కొన్నారు. ఆయన వెంట రెబ్బెన సీఐ సంజయ్‌కుమార్, తిర్యాణి ఎస్సై వెంకటేష్, ఆర్ఎస్సై శ్రీనివాస్, పోలీసులు ప్రభాకర్, శంకర్ ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

పక్కరాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా చూడాలి

కోటపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పక్క రాష్ట్రం నుంచి ఇటు వైపు ధాన్యం రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టి నిఘా పెంచాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. మండలంలోని రాపన్‌పల్లి వల్ల అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును శనివారం ఆయన సందర్శించారు. వాహన తనిఖీల వివరాలను తెలుసుకుని రిజిష్టర్లను పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద 24 గంటల పాటు విధులు నిర్వర్తించాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ధాన్యం ఇటు వైపు రాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం దేవులవాడ, లక్ష్మీపూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి ధాన్యం నిల్వలపై వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ రాఘవేందర్‌రావు, ఆర్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మసీదు అభివృద్ధికి కృషి చేస్తాం

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ సమీపంలో గల అస్రా మసీదు అభివృద్ధికి కృషి చేస్తానని మసీదు కమిటీ అధ్యక్షుడు ఇంతియాజ్ తెలిపారు. అస్రా మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఇంతియాజ్ శనివారం మాట్లాడుతూ గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన దివంగత గులాంను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కమిటీ సభ్యుడు పనిచేయాలన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలు గొప్పవన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇంతియాజ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమర్, సజ్జు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

భీమారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దుర్గం దిలీప్ కిరాణం దుకాణంలో అక్రమంగా నిల్వ చేసుకుని అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు. గ్రామంలో శనివారం తనిఖీలు నిర్వహించగా దిలీప్ కిరాణం షాపులో నాలుగు బీర్లు, రెండు ఫుల్ బాటిల్ల మద్యం లభించిందన్నారు. బెల్టు షాపులను నిర్వహిస్తూ మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. ఈ మేరకు దుర్గం దిలీప్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి





ఎస్టీపీపీలో నివాళులర్పిస్తున్న డైరెక్టర్ తిరుమల్‌రావు, శ్రీరాంపూర్‌లో నివాళులర్పిస్తున్న జీఎం, తదితరులు

జైపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్టీపీపీ డైరెక్టర్ ఈఅండ్ఎం తిరుమల్‌రావు సూచించారు. శనివారం ఎస్టీపీపీలో పర్యటించిన ఆయన భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పేద కుటుంబంలో పుట్టి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ ఎంతో కష్టపడి ఉన్నత చదువులు చదివారన్నారు. మన దేశానికి దిక్సూచి లాంటి రాజ్యాంగాన్ని అందించారన్నారు. వివిధ దేశాలు తిరిగి మన దేశానికి ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. భారతదేశ రాజ్యాంగం చాలా ఆదర్శవంతమైందని తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం నర్సరీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: అణగారిన. దళిత, బహుజన వర్గాల అభ్యున్నతికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పాటుపడ్డారని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి జీఎం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ద్వారానే బలహీన వర్గాలకు ఉన్నత అవకాశాలు, సామాజిక న్యాయం, సమానత్వం సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, ఉద్యోగుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సీ లైజన్ అధికారి ఆనంద్‌కుమార్, డీజీఎం (పర్సనల్) అని ల్‌కుమార్, సీనియర్ పీవోలు మురళి, సురేందర్, ఎస్టీ లైజన్ అధికారి గుండేరావు, లా అధికారి మల్లేష్, పిట్ కార్యదర్శి సందీప్, బీసీ అండ్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ పక్షోత్సవాల్లో సత్తా చాటాలి

- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

శ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్షణ పక్షోత్సవాల్లో శ్రీరాంపూర్ ఏరియా సత్తా చాటాలని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. అన్ని గనులు, విభాగాల అధిపతులతో జీఎం కార్యాలయంలో ఆయన 56వ వార్షిక రక్షణ పక్షోత్సవాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. గతేడాది సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన రక్షణ పక్షోత్సవాల్లో శ్రీరాంపూర్ ఏరియా 19 బహుమతులు గెల్చుకోవడం సంతోషదాయకమన్నారు. ఈసారి కూడా అదేస్ఫూర్తితో అంతకుమించి బహుమతులు సాధించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొదటి స్థానంలో నిలిచేందుకు ప్రయత్నించాలని ఆయన ఆకాంక్షించారు. రక్షణ విషయంలో భూగర్భ గనులు, ఉపరితల గనులు, కార్యాలయాలు, విభాగాలు తగు చర్యలతో సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. ముందస్తుగా లోటుపాట్లను సరిదిద్దుకోవా లని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణారావు, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల పీవోలు వెంకటేశ్వర్లు, ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్రలింగం, క్వాలిటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్ రెడ్డి, అన్ని గనుల మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

రాష్ట్ర, దేశ అవసరాలకు విద్యుత్ సరఫరా



మూడో ప్లాంటు వివరాలను అడిగి తెలుసుకుంటున్న డైరెక్టర్ తిరుమల్‌రావు

జైపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ దేశ, రాష్ట్ర అవసరాలకు విద్యుత్ సరఫరా చేస్తోందని, సంస్థ బాగుంటేనే మనం కూడా బాగుంటామని ఎస్టీపీపీ డైరెక్టర్ ఈఅండ్ఎం తిరుమల్‌రావు పేర్కొన్నారు. శనివారం ఎస్టీపీపీలో పర్యటించి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు మీద ఆధారపడేదని, బొగ్గు కొన్నాళ్లకు అంతరించిపోయే అవకాశం ఉన్నందున మార్కెట్ పరంగా పోటీతత్వం పెరిగిందన్నారు. క్వాలిటీ బొగ్గును వినియోగదారులకు అందించాలని, సంస్థ మనుగడ కోసం బొగ్గుతో పాటు విద్యుత్ రంగంలోకి కూడా అడుగు పెట్టడం జరిగిందన్నారు. పవర్ ప్లాంట్ ఉద్యోగులు ఆటంకాలు లేకుండా ప్లాంట్‌ను నడిపించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు తారతమ్య బేధాలు, వర్గ పోరు లేకుండా శ్రద్ధగా పనిచేయాలన్నారు. అనంతరం మూడవ యూనిట్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్ణీత సమయంలో ప్లాంట్‌పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం నరసింహారావు, అధికారులు మదన్ మోహన్, పంతుల, సత్యనారాయణ, మురళీధర్, శ్రీనివాస్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, దేవేందర్‌సింగ్, వీరబ్రహ్మం, కిరణ్‌బాబు, చంద్రమణి పాల్గొన్నారు.



రేపటి నుంచి రక్షణ పక్షోత్సవాలు

శ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు శ్రీరాంపూర్ ఏరియాలో 56వ వార్షిక పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 8న శ్రీరాంపూర్ ఓసీపీ, 9న ఆర్కే 7 గని, 10న ఇందారం ఓసీపీ, 11న నస్పూర్ డిస్పెన్సరీ, ఇందారం 1ఏ గని, 12న ఎస్ఆర్‌పీ 1 గని, 13న ఎస్ఆర్‌పీ 3, 3ఏ, ఆర్కే 5 గనులు, ఎంవీటీసీ, 15న ఆర్కే న్యూటెక్, 16న శ్రీరాంపూర్ ఓసీపీ, చెన్నూర్ సోలార్ ప్లాంట్, 19న శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో కార్యక్రమం ఉంటుందని ఆయన వివరించారు.

11 నుంచి ఆటల పోటీలు

శ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని శ్రీరాంపూర్ ఏరియాలో ఈ నెల 11వ తేదీ నుంచి ఆటలు, దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల విజేతలకు ఈనెల 23వ తేదీ నుంచి శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. 11, 12 తేదీలలో నస్పూర్ కాలనీలోని సేవా భవన్, శ్రీరాంపూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో మహిళలు, పిల్లలకు బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్, 50 మీటర్ల రన్నింగ్ రేసు, 15, 16 తేదీల్లో నస్పూర్ కాలనీలోని సేవా భవన్, శ్రీరాంపూర్ కాలనీలోని సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు దీపాలంకరణ పోటీలుంటాయని, కార్మిక కుటుంబాల మహిళలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఫారెస్టు కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా ఫారెస్టు కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సింగరేణి ఫారెస్టు కాంట్రాక్టు అసోసియేషన్ నాయకులు అన్నపు రమేశ్, షేక్ జాన్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతు ఈ మధ్యకాలంలో ఫారెస్టు కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారిందని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా సివిల్ డిపార్టుమెంటు మాదిరిగా ఫారెస్టు డిపార్టుమెంటుగా కాంట్రాక్టు క్లాస్‌వైజ్ రిజిస్ట్రేసన్ యాజమాన్యం ఏర్పాటు చేయాలని కోరారు. నర్సరీ టెండర్లను పాత పద్ధతిలో నిర్వహించాలన్నారు. ప్లాంటేషన్‌లలో సర్వైవల్ ఇవ్వడం సాధ్యంకాదని ఓటీ ప్లాంటేషన్‌లో సర్వైవల్ విధానం తీసివేయాలన్నారు. ట్రెంచ్‌లేని బ్లాక్ ప్లాంటేషన్‌కూడ సర్వైవల్ విధానాలు తీసివేయాలని కోరారు. ఎఫ్ఎస్ఆర్ ధరలను మార్కెట్లకు అనుగుంగా సవరించాలని కోరారు. ఇటీవలనే సమస్యల సాధన కోసం అసోసియేషన్ రిజిస్ట్రేషన్ చేశామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు రామగుండం ఎమ్మెల్యే రాజుఠాకూర్ మక్కాన్‌సింగ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఫారెస్టు కాంట్రాక్ట్ అసోసియేషన్ నాయకులు


దండేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సురేఖ


కోటపల్లిలో..



బెల్లంపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


లక్షెట్టిపేటలోనివాళులర్పిస్తున్న నాయకులు

మహనీయుడి ఆశయ సాధనకు కృషి చేయాలి

ఘనంగా వర్ధంతి

మందమర్రిటౌన్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత భారత రత్న డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ వర్ధంతి పట్టణంలో ఆయా రాజకీయ పార్టీలు కుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ రాజలింగు పూల మాలలువేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ సంఘం పట్టణ అధ్యక్షుడు రాంబాబు, నాయకులు వీరస్వామి, కనకం రవి, వాసాల సంపత్ పాల్గొన్నారు.

●ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణ అధ్యక్షుడు జీడి సారంగంతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపత్ పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

●కాంగ్రెస్ పార్టీ నాయకులు సొత్కు సుదర్శన్ పూల మాలలు వేసి నివాలులు అర్పించారు.

●పట్టణ మాలమహానాడు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, పట్టణ నాయకులు రాములు, రవి పాల్గొన్నారు.

తాండూర్ : మాదారం 3 ఇంక్లైన్ గ్రామంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని నేతకాని సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దర్శనాల రాజం, జాడి తిరుపతి పాల్గొన్నారు.

●మండలంలోని కాసిపేట గ్రామంలో అంబేద్కర్, నేతకాని సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేష్, రాజయ్య, అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

దండేపల్లి : అంబేద్కర్ చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని డీసీసీ మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. శనివారం దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పులమాల వేసి నివాళి అర్పించారు.

●అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం మండల, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్, సీపీఐ, బీఎస్పీ, మాలమహానాడు నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: అంబేద్కర్ సంఘంతో పాటు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఊత్కూర్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కాంతయ్య, నర్సయ్య, దర్శన్న, గుత్తికొండ శ్రీధర్, రవి, చిన్నయ్య పాల్గొన్నారు. న్యాయస్థానంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ ప్రదీప్, ఉపాధ్యక్షుడు నళినికాంత్ పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : మంచిర్యాలలోని పూలే భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఐక్యవేదిక నాయకులు మల్లయ్య, రాజేశం, కొండయ్య, జయరావు, రామదాసు, షబ్బీర్ పాషా పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిర్యాల క్రైం : పట్టణంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు రామగిరి బానేష్, వడ్ల రాజమౌళి, నాయకులు కొండ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో మాజీ జడ్పీటీసీ వేల్పుల రవి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు.

నెన్నెల : భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం నెన్నెలలో ఘణంగా నిర్వహించారు. బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబాసాహెబ్ దేశానికి చేసిన సేవ లను గుర్తుచేసుకున్నారు. అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం మల్లేష్ నేత, బానేష్, మహేష్, దుర్గం కృష్ణస్వామి, గట్టు శివలింగయ్య, ప్రవీణ్ నేతకాని కుల పెద్దలు పాల్గొన్నారు.



మందమర్రిలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్..బెల్లంపల్లిలో నాయకుల నివాళి

నాయకులకు, ప్రజలకు అండగా ఉంటా...

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రహదారి వెడల్పు పనులతో ప్రజలను, వ్యాపారస్తులను ఇబ్బందులు గురి చేస్తున్నారని అలాగే సర్పంచ్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడుతున్నారని అందరికీ అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో 60 ఫీట్ల వెడల్పుతో రహదారి వెడల్పు పనులు ప్రారంభిస్తున్నామని వ్యాపారులను, ప్రజలను అధికారపార్టీ నాయకులు భయాందోళనకు గురి చేస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కన్నెపల్లి మండలంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ మహిళ నాయకురాలుపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సరైందికాదన్నారు. వేమనపల్లి మండలంలో రౌడి రాజ్యం నడుస్తుందని, నేరచరిత్రగల నాయకులు సర్పంచ్ ఎన్నికల్లో బరిలో ఉంటున్నారన్నారు. అబద్ధాలతో ఎమ్మెల్యే గడ్డం వినోద్ బెల్లంపల్లికి ఎమ్మెల్యే అయ్యాడన్నారు. ఎన్నికల సమయంలో స్థానికంగా ఉంటానని బాండ్‌పేపర్‌పై రాసి దేవాలయంలో ప్రమాణం చేసినప్పటికీ స్థానికంగా ఉండడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల సుదర్శన్, నూనెటి సత్యనారాయణ, రేవెల్లి విజయ్, నబ్బని అరుణ్, గోపి, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎసన్‌వాయి సర్పంచు స్థానం ఏకగ్రీవం


ఎం రజిత(ఫైల్)

కోటపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎసన్‌వాయి గ్రామపంచాయతీ సర్పంచు స్థానం ఏకగ్రీవం కావడం ఇక లాంచనమే అయ్యింది. ఈ పంచాయతీ ఎస్సీ జనరల్‌కు కేటాయించగా గ్రామానికి చెందిన మారుపాక రజిత ఒక్కరు మాత్రమే నామినేషన్ సమర్పించారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఎన్నికల అధికారులు ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి. అలాగే గ్రామంలో 8 వార్డులు ఉండగా 6 వార్డులకు ఒక్కొక్కరే నామినేషన్‌లు సమర్పించారు. మరో రెండు వార్డుల్లో పోటీ ఉండగా ఒక్కొక్క నామినేషన్ వచ్చిన ఆరు వార్డులు సైతం ఏకగ్రీవం అయినట్లే. ఇక పంగిడి సోమారం పంచాయతీలోని రెండవ వార్డు బీసీ జనరల్‌కు కేటాయించగా ఈ వార్డులో ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఈ స్థానం ఖాళీగానే మిగిలిపోనుంది.

ప్రజా చైతన్యం కోసం పాటు పడుతున్న కళాకారులు


బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ సతీమణి హారిక ప్రియ

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా చైతన్యం కోసం కళాకారులు పాటు పడుతున్నారని రాష్ట్ర సంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు అంతడపుల నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ సమిష్టి చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివంగత జర్నలిస్టు ఎండీమునీర్ స్మారకార్థం నిర్వహించిన 2025 బాల కళోత్సవం బహుమతుల ప్రధానానికి ఆయన హాజరై మాట్లాడారు. కళాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పట్టణ ఎస్ఐ సతీమణి హారిక ప్రియ మాట్లాడుతూ చిన్నారులకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. అంతకుముందు మునీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్వహకులు రాం బాబు, శేఖర్, మునీర్ కుటుంబీకులు ఎండీ సంధాని, మయూర్ తదితరులు పాల్గొన్నారు.

జీడీకే 1ఇంక్లైన్‌లో భద్రత పక్షోత్సవాలు

గోదావరిఖని, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రామగుండం రీజియన్‌లో మొదటగా ప్రారంభమైన జీడీకే 1ఇంక్లైన్‌లో ప్రమాదాల స్థాయిని జీరో లెవల్‌కు తగ్గించేందుకు చర్యలు చేపట్టారు. బొగ్గు గనుల ని యంత్రణ చట్టం-2017 సవరణ తరువాత బొగ్గు గనుల్లో కొత్త నియామకాలు ఎక్కువగా జరుగడంతో ఉద్యోగులకు భద్రతపై పూర్తి అవగాహన కల్పించాలని డీజీఎంఎస్ ఆదేశించింది. ఈ మేరకు 1ఇంక్లైన్ లో భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రమాదాల స్థాయిని సున్నాకు తగ్గించాలనే ఆలోచనతో పని చేస్తున్నట్టు మేనేజర్ సుధీర్ జకుల్‌వార్ పేర్కొన్నారు.

56వ భద్రత పక్షోత్సవాల సందర్భంగా ఉద్యోగు లందరూ సమిష్టిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు వారు పేర్కొన్నారు. పక్షోత్స వాల కార్యక్రమంలో జీఎం లలిత్ కుమార్, ఏజెంట్ రమేష్, మేనేజర్ సుధీర్ జకుల్ వార్, సేఫ్టీ ఆఫీసర్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



తిమ్మాపూర్‌లో కవాతు చేపడుతున్న పోలీసులు

లక్షెట్టిపేట, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. ఏసీపీ ప్రకాష్ మాట్లాడుతూ ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ఏరకమైన ప్రలోభాలకు గురి చేసి ఓటు వేయమన్న వేయకూడదని మనకు నచ్చిన వ్యక్తికి మన ఇష్టంగా స్వేచ్ఛగా మనం ఓటు వేసుకోవాలన్నారు. పోలీసులు ఉన్నది ప్రజల కోసం, ప్రజల రక్షణ కోసమని ఎవరైన బెదిరింపులకు పాల్పడ్డ, ఇబ్బంది పెట్టినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామంలో వాడ వాడన తిరుగుతూ కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, దండేపల్లి జన్నారం ఎస్సైలు తహసీయోద్దీన్, అనూష, ఎస్సై-2రామయ్యతో పాటు సుమారు వంద మంది పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

జన్నారం: స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలని జన్నారం మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారిపై మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాశ్ ఆధ్వర్యంలో ఫ్లగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతవాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో గందరగోళం సృష్టించడం, బెదిరింపులకు పాల్పడడం గొడవలకు పాల్పడడంతో పాటు ప్రలోభాలకు గురిచేసిన ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని అన్నారు. లక్షెట్టిపేట సీఐ రమణామూర్తి, కన్నెపల్లి, జన్నారం ఎస్ఐలు అనూష, కాసినోద్దీన్ పోలీసులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నస్పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం సింగపూర్ -గుత్తదారుపల్లి పునరావాస కాలనీలో నిరుపేద వృద్ధులకు శనివారం కాంట్రాక్టర్ కొలిపాక రవి ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. వృద్ధులు చలిలో ఇబ్బందులు పడకుండా దుప్పట్లను పంపిణీ చేశామ న్నారు. మాజీ కోఆప్షన్ సభ్యులు భాగ్యలక్ష్మి జనార్ధన్, కాలనీ వాసులు రామన్న, మల్లేష్, శ్రావణ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశెట్టివాడకు చెందిన చెరుకు రాకేష్ (33) ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

ముమ్మరంగా 'పంచాయతీ' ప్రచారం..

(5వ పేజీ తరువాయి)

గడ్డం వినోద్‌ల ఆదేశాల మేరకు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, ఆ పార్టీ శ్రేణులు ప్రచారం కోసం గ్రామాలబాట పడుతున్నారు. అలాగే మూడు నియోజకవర్గాల పరిధిలో బీఆర్ఎస్, బీజేపీలు మద్దతిస్తున్న అభ్యర్థుల తరుపున ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

అభివృద్ధి చేసే వారికే మద్దతు..

పంచాయతీ ఎన్నికల్లో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయగలిగే వారినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలనే పట్టుదలతో ఓటర్లు ఉన్నారు. పంచాయతీ ఎన్నికల్లో నేరుగా పార్టీల ప్రమేయం లేకపోవడం, స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో ఓటర్లు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. సర్పంచ్ అభ్యర్థుల పూర్వపు చరిత్ర, స్థానిక సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండి, అభివృద్ధి చేయాలనే ధృడ సంకల్పం ఉన్న వారికే ప్రాధాన్యం ఇచ్చేందుకు ఓటర్లు సిద్ధపడుతున్నారు. మరోవైపు మొదటి రెండు విడతల్లో ఏకగ్రీవం అయిన పంచాయతీల్లోనూ అభ్యర్థుల సామర్థ్యానికే పెద్దపీట వేసినట్లు తెలుస్తోంది. గ్రామాల్లోనూ విద్యావంతులైన యువత అధికంగా ఉండటంతో తమ గ్రామాలను అభివృద్ధి పయనంలో నడిపించేందుకు సరియైన అభ్యర్థినే సర్పంచ్‌గా ఎన్నుకోవాలనే నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత బొగ్గు ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ. 10 వేలు ఇవ్వాలని పార్లమెంట్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడాన్ని హర్షిస్తూ శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్‌లో ఎంపీ చిత్రపటానికి సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో దివంగత కాకా వెంకటస్వామి కృషి వల్లనే సింగరేణి విశ్రాంత కార్మికులకు పెన్షన్ అందుతుందన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ పెంచాల్సి ఉన్నా కేంద్ర ప్రభుత్వం కానీ, సీఎంపీఎఫ్ ట్రస్టు కానీ పెంచడం లేదన్నారు. తక్కువ పెన్షన్‌తో విశ్రాంత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెన్షన్‌ను రూ. 10 వేలకు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవాధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, నాయకులు నర్సయ్య, రాజిరెడ్డి, లక్ష్మణ్, రామస్వామి, సత్యనారాయణ, రాయ్య, బాబు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మూడో విడతలో పోటా పోటీ

- చివరి రోజు భారీగా నామినేషన్లు..
- శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ



చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా చెన్నూరు మండలంలోని 30 గ్రామపంచాయతీలకు నామినేషన్ ప్రక్రియ శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. 30 పంచాయతీల్లో సర్పంచు స్థానాలకు మొత్తం 249 నామినేషన్‌లు రాగా 244 వార్డు సభ్యులకు 619 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు.

భీమారం : మండలంలో మొత్తం 11 గ్రామపంచాయతీలకు 64 మంది సర్పంచు అభ్యర్థులు, 94 వార్డులకు 196 మంది నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు.

మందమర్రిరూరల్ : మండలంలో శుక్రవారం రాత్రి నామినేషన్‌ల పర్వం ముగిసింది. మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచుకు 95 నామినేషన్లు, 86 వార్డులకు 218 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. పులి మడుగులో సర్పంచు స్థానానికి నామినేషన్ వేసిన మహిళ అభ్యర్థి వయస్సు తక్కువగా ఉండడంతో రిజెక్టు అయినట్లు తెలిపారు. శనివారం అభ్యర్థుల జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుపై ప్రదర్శించారు.

కోటపల్లి : మూడో విడత నామినేషన్‌ల చివరి రోజైన శుక్రవారం అర్ధరాత్రి దాటేంత వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. మండలంలోని మొత్తం 31 పంచాయతీలకు 247 మంది సర్పంచు అభ్యర్థులు, 258 వార్డులకు 605 మంది నామినేషన్‌లు సమర్పించారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో ఇక నామినేషన్‌ల ఉపసంహరణపై అభ్యర్థులు దృష్టి పెట్టారు.

కాసిపేట మండలంలో సర్పంచ్ బరిలో 64 మంది..

కాసిపేట : మండలంలో రెండవ విడత సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల కోసం శనివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. 21 గ్రామపంచాయతీలకు 64 మంది సర్పంచు అభ్యర్థులు, 190 వార్డులకు గాను 349 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. 22 గ్రామపంచాయతీలకు 113 మంది అభ్యర్థులు సర్పంచు కోసం నామినేషన్‌లు దాఖలు చేయగా, శనివారం 29 మంది ఉపసంహరించుకున్నారు. 190 వార్డులకు గాను 393 మంది నామినేషన్‌లు దాఖలు చేయగా 21 మంది ఉపసంహరించుకున్నారు. ధర్మారావుపేట గ్రామ పంచాయతీ సర్పంచుగా జుగునక రాధ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మామిడిగూడెం పంచాయతీలోని మొత్తం 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అక్షర క్రమంలో అభ్యర్థుల కు గుర్తులను అధికారులు కేటాయించారు.

వేమనపల్లి :మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో సర్పంచు స్థానాలకు 28 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. శనివారం నామినేషన్‌ల ఉపసంహరణ అనంతరం 28 మంది బరిలో నిలిచారు. 118 వార్డులకు గాను 232 మంది బరిలో ఉన్నారు. కల్లెంపల్లి గ్రామ పంచాయతీలో 1వ వార్డు ఏకగ్రీవం అయ్యింది. ఆత్రం శంకర్, మరో వ్యక్తి నామినేషన్ వేయగా నామినేషన్‌ల పరిశీలనలో మరో వ్యక్తి వ్యక్తి నామినేషన్ తిరస్కరణకు గురి కావడంతో శంకర్ ఎన్నిక ఏకగ్రీవమైందని ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు.

నెన్నెల : మండలంలో నామినేషన్ల ఉపసంహరణల అనంతరం అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించారు. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో 54 మంది సర్పంచ్ పదవికి పోటీలో ఉన్నారు. పరిశీలన ల అనంతరం 91 మందిలో 37 మంది ఉపసంహరించుకోవడంతో 54 మంది బరిలో నిలిచారు.

'లెదర్ పార్కు స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవు'

మందమర్రిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లెదర్ పార్కుకు సంబంధించిన స్థలాన్ని అన్యాక్రాంతం చేస్తే చర్యలు తప్పవని తెలంగాణ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషనల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎస్టేట్ ఆఫీసర్ బిక్షునాయక్ తెలిపారు. శనివారం పట్టణంలోని లెదర్ పార్కుతోపాటు దానికి కేటాయించిన స్థలాన్ని స్థానిక తహసీల్దార్ సత్య నారాయణతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పార్కుకు సంబంధించి 25 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. త్వరలోనే లెదర్‌పార్కుల ప్రారంబోత్సవానికి సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని తెలిపారు. ఈ స్థలాన్ని కొంతమంది అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని వెంటనే దీనికి సంబంధించి భూమిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ డిపార్టుమెంటుపై ఉందని తెలిపారు. త్వరలోనే స్థలానికి సంబంధించి హద్దులు కూడ ఏర్పాటు చేస్తామని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ హద్దులు ఏర్పాటు చేసుకుంటే ఆ స్థలాన్ని కాపాడుతామని తెలిపారు. ఆర్ఐ గణపతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిక్షునాయక్

హోంగార్డుల పని తీరు ప్రశంసనీయం

సీపీ అంబర్ కిషోర్ ఝూ


ప్రశంసా పత్రం అందుకుంటున్న హోంగార్డు అబ్దుల్ ఖదీర్

మంచిర్యాల క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డుల పని తీరు ప్రశంసనీ యమని, విధి నిర్వహణలో వారి త్యాగం, బలిదానాలు మరువలేనివని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో శనివారం 63వ హోంగార్డు రైసింగ్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరేడ్ కమాండర్‌గా హోంగార్డు ఆర్ఐ పెద్దన్న వ్యవహరించగా ముఖ్య అతిథులుగా కమిషనర్ హాజరై వందనం స్వీకరించారు. క్రమశిక్షణ, సేవా స్ఫూర్తి పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచి ఏసీపీ ప్రతాప్, ఇన్స్ పెక్టర్ భీమేష్, శేఖర్, సంపత్, హోంగార్డులు పాల్గొన్నారు.

చెన్నూరు: చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న హోంగార్డు అబ్దుల్ ఖదీర్ శనివారం సీపీ అంబర్ కిశోర్ ఝూ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అబ్దుల్ ఖదీర్ విధుల్లో చురుగ్గా ఉంటూ సీసీ కెమెరాలు పని చేసేలా చూసుకుంటూ, దొంగతనాలు, నేరాలను సీసీ కెమె రాల ద్వారా చేధించడానికి కృషి చేసినందుకు ప్రశంసాపత్రం అందజేశారు.



అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



బీసీ నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ రమేష్ అన్నారు. బీసీ నాయకుడు సాయి ఈశ్వర్‌చారి ఆత్మహత్యకు నిరసనగా జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో బీసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించకుండా ఎన్నికలు నిర్వహిస్తుండడంతో మనస్తాపం చెంది సాయి ఈశ్వర్‌చారి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఆయన త్యాగాన్ని వృధా కానివ్వమని ఈ సందర్భంగా తెలిపారు. సాయిఈశ్వర్ చారిది ఆత్మహత్య కాదని ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని అన్నారు. బీసీ రిజర్వేషన్ ఇస్తామంటూనే రేవంతరెడ్డి తడిబట్టతో బీసీల గొంతు కోశారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, మారుతి, శంకర్, నారాయణ, పురుషోత్తం, బాలేష్, లహుకుమార్, ప్రశాంత్, సాయికృష్ణ, రవికాత్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

- మొదటి విడత ఎన్నికలు జరగనున్న పంచాయతీల్లో ఊపందుకున్న ప్రచారం
- మొదటి విడతలో ఏడు పంచాయతీలు ఏకగ్రీవం
- రెండు, మూడో విడతకు ముగిసిన నామినేషన్ల ఘట్టం



ఆసిఫాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల కోలాహలం నెలకొంది. మొదటి విడత ఎన్నికలు జరగనున్న గ్రామ పంచాయతీల్లో ప్రచారం జోరందుకుంది. నామినేషన్ ఉపసంహకరణ ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని వేగవంతం చేశారు. జిల్లాలో మూడు దఫాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 335 పంచాయతీలు, 2,874 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత నామినేషన్ల విత్‌డ్రా ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రెండు, మూడో విడత నామినేషన్ల స్వీకరణ గట్టం ముగియగా నామినేషన్ల ఉపసంహరణ, బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు. మొదటి విడతలో ఆసిఫాబాద్ డివిజన్‌లోని వాంకిడి, కెరమెరి, జైనూరు, సిర్పూర్ (యూ), లింగాపూర్ మండలాల్లో నిర్వహిస్తుం డగా ఆయా మండలాల్లోని పంచాయతీల్లో ప్రచారం ఊపందుకుంది. రెండో విడతలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూర్, చింతలమానేపల్లి, దహెగాం, కౌటాల, పెంచికల్ పేట్, సిర్పూర్-టి మండలాల్లో మూడో విడతలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్ , ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ మండలాల్లో నామినేషన్ల ఘట్టం ముగిసింది. దీంతో పల్లెల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది.

మొదటి విడతలో 576 వార్డుస్థానాలు ఏకగ్రీవం..

జిల్లాలో మొదటి విడతలో భాగంగా జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమెరి, వాంకిడి మండలాల్లోని 114 గ్రామ పంచాయతీలకు, 944 వార్డు స్థానాలకు ఈ నెల 11న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏడు పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 576 వార్డుస్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో లింగాపూర్ మండలంలోని కంచన్‌పల్లి, మామిడిపల్లి పంచాయతీలు, వాంకిడి మండలంలోని దాబా, లెండిగూడ, నవేగూడ పంచా యతీలు, కెరమెరి మండలంలో ధనోర, బాబేఝరి గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 107 గ్రామపంచాయతీల్లో 396 మంది సర్పంచ్ అభ్యర్థులు, 368 వార్డుల్లో 855 మంది పోటీల్లో ఉన్నారు.

రెండు సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు నిల్..

జిల్లాలో రెండో, మూడో విడతలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. రెండో విడత ఎన్నికల్లో కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూర్, చింతలమానేపల్లి, దహేగాం, కౌటాల, పెంచికల్‌పేట్, సిర్పూర్-టి మండలాలలో 113 పంచాయతీలకు 737 నామియేషన్లు, 992 వార్డు స్థానాలకు 2,428 నామినేషన్లు దాఖలయ్యాయి. మూడోవిడతలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్‌లోని ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లో 108 పంచాయతీలకు 591 నామినేషన్లు, 938 వార్డు స్థానాలకు 2,246 నామినేషన్లు ధాఖలయ్యాయి. ఇందులో రెండు సర్పంచ్ స్థానాలకు ఆరు వార్డు స్థానాలకు రిజర్వేషన్ కేటాయించిన ప్రకారం అభ్యర్థులు లేకపోవడంతో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలి

- ఎస్పీ నితికా పంత్

కాగజ్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని ఎస్పీ నితికా పంత్ సూచించారు. గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను మరింత బలపరిచే లక్ష్యంతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, శాంతియుతంగా జరగడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రజల్లో నమ్మకం పెంపొందించడం, శాంతిభద్రత పరిస్థితులను పర్యవేక్షించడం, ఎన్నికల సమయంలో అసాంఘిక, అవాంఛనీయ చర్యలను అరికట్టడం ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశమని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదన్నారు. డబ్బు, మద్యం, బహుమతుల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మూడు ప్రధాన చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వాహిదుద్దీన్, సీఐలు ప్రేంకుమార్, కుమార స్వామి, ఎస్‌ఐలు సందీప్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.




కాగజ్‌నగర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఎస్పీ, పోలీసులు, దహెగాం మండలం కల్వాడలో..

కల్వాడలో పోలీసుల కవాతు

దహెగాం (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కల్వాడ గ్రామంలో శనివారం కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు విక్రమ్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

తిర్యాణి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం గోయగాం గ్రామపంచాయతీకి చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్ సమక్షంలో శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి జగదీష్ ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, మల్లేష్, మధుకర్, రమేష్, వెంకటి, రమేష్, కృష్ణ, భీంపటేల్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కండువాలు కప్పుతున్న నాయకుడు జగదీష్

పంచాయతీ ఎన్నికలో స్వేచ్ఛగా పాల్గొనాలి

- డీఎస్పీ వహిదుద్దీన్ - దళం పేరుతో బెదిరింపు ఘటనపై విచారణ



రన్‌వెల్లి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వహిదుద్దీన్

కౌటాల(చింతలమానేపల్లి), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధైర్యపడకుండా స్వేచ్ఛగా ఎన్నికల్లో పాల్గొనాలని కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ అన్నారు. చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామంలో దళం పేరుతో బెదిరింపు ఘటనలో ఆయన విచారణ జరిపారు. సర్పంచ్ అభ్యర్థి దర్శన మామ బాపు ను దళం పేరుతో తుపాకీ గురిపెట్టి లేఖ ఇచ్చిన సందర్భంగా విచారణను ముమ్మరం చేశారు. బాపును పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నింది తుడి ఆనవాళ్లు ఎలా ఉంటాయో అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనా లని తాము అండగా ఉంటామని తెలిపారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామని భరోసా ఇచ్చారు. కౌటాల సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు నరేష్ ఆ దారిలో వెళ్లే సీసీ కెమెరాలను పరిశీలించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తూ భరోసా ఇచ్చారు.

పోలీస్‌శాఖలో హోంగార్డుల పాత్ర కీలకం

- ఎస్పీ నితికా పంత్

ఆసిఫాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు హోంగార్డు 63వ వ్యవస్థాపక దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ చిత్తరంజన్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా పోలీసు వ్యవస్థలో హోంగార్డులు కీలకమైన భాగస్వాములు, శాంతిభద్రతల పరిరక్షణలో వారు పోషిస్తున్న పాత్ర కీలకమని తెలిపారు. ప్రజల భద్రత, విపత్తుల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నేర నియంత్రణ, పోలీసు బలగాలకు అవసరమైన సహకారం అందించడంలో హోంగార్డులు చూపుతున్న క్రమశిక్షణ, విధేయత, నిబద్ధతను ఎస్పీ ప్రశంసించారు. హోంగార్డులు ఎల్లప్పుడు ముందుండి విధులను నిర్వర్తించడం, పండుగలు, ఎన్నికలు, విశేష కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని ప్రజాసేవలో తమ వంతు పాత్రను నిర్వర్తించడం అభినందనీయమని కొనియాడారు.

సమాజ శాంతి భద్రతల విషయంలో ప్రతీ హోంగార్డు చూపుతున్న అంకితభావం పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. అనంతరం విధుల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన హోంగార్డులను గుర్తింపుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, ఆర్ఐ హోంగార్డు విద్యాసాగర్, ఆర్ఐలు వామనమూర్తి, అంజనన, తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ నితికా పంత్

అంబేద్కర్ ఆశయాలను ప్రతీ ఒక్కరు ముందుకు తీసుకెళ్లాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

- జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్ వర్ధంతి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో శనివారం అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, సరస్వతీ, అహ్మద్, భీమేష్, శ్రీను, వెంకన్న, నిసార్, నారాయణ, జీవన్, వామన్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి అంబేద్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చైర్మన్ రూప్‌నార్ రమేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రణయ్, మారుతి, నారాయణ, పురుషోత్తం, బాలేష్, లహుకుమార్, ప్రశాంత్, సాయికృష్ణ, రవికాంత్, నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.





ఆసిఫాబాద్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, తిర్యాణిలో నేతకాని సంఘం నాయకులు..

తిర్యాణి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి నేతకాని సంఘం నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకుల రాజయ్య, రమేష్, భూమయ్య, పవన్, తిరుపతి, రాజు, బాపు, అశోక్‌గౌడ్, శోహన్, మోహన్, ధర్మం, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమన, కనర్‌గాం, వాంకిడి, బెండార, ఇంధాని, ఖిరిడి, తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు , చిత్రపటాలకు పూమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్రె జయరామ్, బిఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం దుర్గాజీ, దుర్గం శ్యాంరావు, ఉప్రె విజయ్, హంసరాజ్, రాజేశ్వర్, సందీప్, రోషన్, విలాస్, టేమాజీ, మారుతి, దుర్గం దినకర్, శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణ, దీపక్ ముడె, పెంటు, రమాబాయి పాల్గొన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో గల అంబేద్కర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు కాంబ్లె బాప్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆత్రం శంకర్, నాయకులు పెందోర్ రాము, ఆత్రం దిన్‌కర్‌షా, కుమ్ర దేవిదాస్, ఆత్రం లచ్చు తదితరులు పాల్గొన్నారు.

ఆ స్థానాలకు అభ్యర్థులే లేరు...


- రెండు సర్పంచ్, నాలుగు వార్డు స్థానాలకు నామినేషన్ నిల్

- ఉప సర్పంచ్‌లే కీలకం

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహపల్లి, చిలాటిగూడ గ్రామపంచాయతీల్లో రిజర్వేషన్ల ప్రకారం ఎన్నుకునేందుకు సర్పంచ్ అభ్యర్థులు కరువయ్యారు. దీంతో అక్కడ ఉప సర్పంచులకు అదృష్టం కలిసిరానుంది. రహపల్లి పంచాయతీ గతంలో ఏజెన్సీ గ్రామంగా ఉంది. కొత్త పంచాయతీలు ఏర్పాటులో భాగంగా భీంపూర్ గ్రామపంచాయతీ నుంచి రహపల్లి కొత్త పంచాయతీగా మారింది. ఏజెన్సీ కావడంతో సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఇక్కడ ఎనిమిది వార్డులు ఉంటే అందులో నాలుగు వార్డులు సైతం ఎస్టీలకే కేటాయించారు. కానీ రహపల్లిలో ఎస్టీ వర్గానికి చెందిన వారు ఎవరు లేరు. దీంతో మిగిలిన వార్డు సభ్యుల్లో ఒకరు ఉపసర్పంచ్‌గా ఎన్నికై సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. అలాగే చిలాటిగూడ పంచాయతీ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఎనిమిది వార్డుల్లో ఒక వార్డు ఎస్సీకే కేటాయించారు. అయితే చిలాటిగూడ పంచాయతీలో ఎస్సీ వర్గానికి చెందిన కుటుంబాలు లేవు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం జీవో నంబర్ 42 ప్రకారం మిగతా ఏడు వార్డులకు ఎన్నికలు నిర్వహించి వారి నుంచి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎంపిక చేయనున్నారు.

ఆత్మలూ ఓటు వేస్తాయి..

- ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు



ఓటరు లిస్టులో రెండుసార్లు నమోదైన ఒకే వ్యక్తి పేరు



చనిపోయిన రామగిరి ఇందుబాయికి ఏడో వార్డులో ఉన్న ఓటు

వాంకిడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ప్రతీ సంవత్సరం సవరణ కార్యక్రమం చేపడుతోం ది. 18 ఏళ్లు నిండిన వారి పేర్లను నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను, రెండు చోట్ల పేరు ఉన్న వారిని తొలగించడం చేస్తుంటారు. ఇంత చేస్తున్నా.. ఓటరు జాబితా సక్రమంగా ఉండటంలేదు. వాంకిడి మండలంలో ఓటరు జాబితాను పరిశీలిస్తే అనేక తప్పులు కనిపించాయి. చనిపోయిన వారి పేర్లు ఓటరు జాబితాలో అలాగే ఉన్నాయి. కొంత మంది పేర్లు రెండు చోట్ల ఉన్నాయి. మండల కేంద్రంలోని 7వ వార్డులోనే ఇన్ని తప్పులు ఉన్నాయంటే మండలంలోని 18 పంచాయతీల్లో ఓటరు జాబితాలో ఎన్ని తప్పులు ఉన్నాయో ఆలోచించుకోవాలి. జిల్లాలోని 335 పంచాయతీల్లోని 2,874 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,53,895 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. వీరిలో 1,76,606 మంది పురుషులు, 1,77,269 మంది మహిళలు 20 మంది ఇతరులు ఉన్నారు.

- కొన్ని ఉదాహరణలు...

మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలోని 7వ వార్డులో దాదాపు ఏడుగురు చనిపోయిన వారు, ముగ్గురు రెండు చోట్ల పేర్లు ఉన్న వారిని తొలగించలేదు.

చనిపోయిన వారి వివరాలు.. మొగులురి భాస్కర్, సిరియల్ నంబర్ 2298, ఇటన్‌కార్ గోవింద్, నంబరు 2312, శేక్ మహబూబ్, నంబరు 2448, ఖలీల్ బీన్ అహ్మద్ చైస్, నంబరు 2472, రామగిరి ఇందుబాయి, నంబరు 2523, కాలవార్ మహేష్, నంబరు 2548, రిజ్వాం మొహమద్, సీరియల్ నంబరు 2578.

అదృష్టం అంటే తాటి కుమారిదే..

- లెండిగూడ గ్రామపంచాయతీ ఎస్టీకి రిజర్వ్

- గ్రామంలో ఒక్కరే గిరిజన మహిళ

- రెండోసారి సర్పంచ్‌గా ఏకగ్రీవ ఎన్నిక



వాంకిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నిక ఏదైనా... పోటీ లేకుండా పదవిని దక్కించుకోవడం అదృష్టంగా భావించాల్సిందే. ప్రస్తుతం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో అనేక మంది అభ్యర్థులు బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరిక్షించుకుంటు న్నారు. వాంకిడి మండలంలోని లెండిగూడ గ్రామ పంచాయతీలో సర్పంచ్ పదవి ఎస్టీ జనరల్ రిజర్వేషన్ వచ్చింది. ఈ పంచాయతీలో తాటి కుమారి అనే ఎస్టీ మహిళ ఒక్కరే ఉండడంతో రెండోసారి సర్పంచ్ పదవి వరించనుంది. గత పంచాయతీ ఎన్నికల్లోను ఈ పంచాయతీ ఎస్టీలకు రిజర్వ్ కావడంతో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయింది. ఈ పంచాయతీలో 8 వార్డులు ఉండగా నాలుగు ఎస్టీలకు రిజర్వ్ కాగా నాలుగు జనరల్ స్థానాలున్నాయి. ఇందులో నాలుగు వార్డులకు ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో కేవలం నాలుగు జనరల్ వార్డులకు మాత్రమే ఎన్నికలు జరగనున్నాయి.

మేజర్ పంచాయతీలపై అందరి దృష్టి



సిర్పూర్(టి) గ్రామపంచాయతీ కార్యాలయం

సిర్పూర్(టి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీలపై ప్రధాన పార్టీల నాయకులు దృష్టి సారిస్తు న్నారు. సిర్పూర్(టి) మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 27 గ్రామాల్లో మొత్తం 22,182 మంది ఓటర్లు ఉన్నారు. ప్రత్యేకంగా జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీ అయిన సిర్పూర్(టి)తో పాటు కౌటాల, బెజ్జూరు, చింతలమానేపల్లి, దహెగాం, పెంచికలపేట మండల కేంద్రంలోని సర్పంచ్ సీట్లను కైవసం చేసుకోవాలని ఆయా ప్రధాన పార్టీల నాయకులు ప్రత్యేక దృష్టి సారిస్తు న్నారు. సిర్పూర్(టి) మేనేజర్ గ్రామ పంచాయతీలో 14 వార్డుల్లో మొత్తం 7,493 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 3,802 మంది మహిళలు, 3,690 మంది పురుష ఓటర్లు, ఇతరులు ఒక్కరుఉన్నారు. మిగితా 15 పంచాయతీల్లో ఆయా పార్టీల నాయకులు దృష్టి సారిస్తున్నప్పటికీ ముఖ్యంగా సిర్పూర్(టి) మేజర్ పంచాయతీపైనే అత్యధిక శ్రద్ధ కనబరుస్తున్నారు.

బరిలో ఏడుగురు అభ్యర్థులు..

సిర్పూర్(టి) మేనేజర్ గ్రామ పంచాయతీలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ స్థానాన్ని బీసీ మహిళకు కేటాయించడంతో ఇక్కడి నుంచి ఏడుగురు మహిళలు ఆఫిపా షఫినా, అంజనాబాయి ఎల్ములె, తఫిమా పర్వీన్, ఒడ్డెటి నాగమణి, షేక్ షబీనా, సఖియాసుల్తానా బేగం, సుధా దామెరపల్లి బరిలో నిలిచారు. ఆఫిపా షఫినా, అంజనాబాయి ఎల్ములె, సుధా దామెరపల్లి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా తఫిమా పర్వీన్‌కు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతు తెలపగా, అదే పార్టీకి చెందిన ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ షేక్ షబీనాకు మద్దతు తెలుపున్నారు. ఒడ్డెటి నాగమణి బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మద్దతు ఇస్తున్నారు. సఖియా సుల్తానా బేగంకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ దండె విఠల్ మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో సిర్పూర్(టి)లో ఎన్నికల రసవత్తరంగా జరగనుంది.